క్లుప్తంగా

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



నందిగామ: మండలంలోని చందాపురంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులంతా కలిసి ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మందా పిచ్చయ్య, ఎక్కిరాల హనుమంతరావు, దారెల్లి పెద్ద కోటేశ్వరరావు, అనంత రాములు, బంకా రాజా, ఏడుకొండలు, బ్రహ్మయ్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం



నందిగామ: కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా ఇప్పటికే కొన్ని గ్రామాల పరిధిలో పత్తి పంటను సాగుచేయగా మిగిలిన గ్రామాల పరిధిలో కూడా రైతులు పత్తి విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. అధికారుల లెక్కల ప్రకారం నందిగామ నియోజకవర్గ పరిధిలో మొత్తం 34,483 హెక్టార్లలో సాగు భూమి ఉండగా, అందులో అధికంగా 17,175 హెక్టార్లలో రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. మారాకు దశలో ఉన్న పత్తి పొలాలలో రైతులు మొలకెత్తని విత్తనాల ప్రాంతంలో పడిపాదులు విత్తుతున్నారు. ఇక కొన్ని గ్రామాల పరిధిలో రైతులు పత్తి విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. మొత్తం మీద నియోజకవర్గవ్యాప్తంగా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై బిజీబిజీగా కనిపిస్తున్నారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం



మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడరోడ్ బీ కన్వెన్షన్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాజీ విప్ సామినేని ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ ఓటమిపై నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ గెలిచినప్పుడు ప్రజాభిమానాన్ని స్వీకరించానని..ఓటమి చెందినపుడు ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తానన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని గుర్తుచేశారు. 2019లో టీడీపీ కేవలం 23 సీట్లు మాత్రమే వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు ఆపార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంకగా మారుతుందని ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు దుష్ప్రచారం చేశారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి రాష్ట్రబడ్జెట్ సరిపోదన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని హామీలు గుప్పించారన్నారు. పాఠశాలలు తెరవగానే 'అమ్మకు వందనం' ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఆచరణలో పెట్టలేదన్నారు. వచ్చే ఆరు నెలల్లోనే టీడీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను ఎదుర్కొనక తప్పదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతోపాటు నియోజకవర్గంలో కూడా ఓటమి చెందడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పేట పట్టణంలో 25ఏళ్ల సర్పంచ్‌గా పనిచేసిన తనతండ్రి సామినేని విశ్వనాథం హయాం నుంచి కూడా పట్టణంలో బలమైన పట్టు ఉన్న ఆయా వార్డుల్లోనూ టీడీపీకి మెజార్టీ రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వత్సవాయి మండలం చిల్లకల్లు తదితర బలమైన గ్రామాల్లో తమకు ఓటు బ్యాంకు ఉందని, అక్కడ కూడా తమకు తక్కువ ఓట్లు రావడం నమ్మశక్యంగా లేదన్నారు. ఈవీఎం మిషన్లపై కూడా రాష్ట్రవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూలేని విధంగా వందలాది కోట్లాది రూపాలయలతో అభివృద్ధి చేసిన వైనాన్ని గుర్తుచేశారు. తన హయాంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు అందరం పనిచేద్దామన్నారు. సేవ చేస్తారని ప్రజలు టీడీపీ నాయకులకు అధికారం ఇస్తే వారు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు, బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ఈ విధానం తగదని టీడీపీ నాయకులకు హితవు పలికారు. సమావేశంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

మెట్టపైర్లు కళకళ

వర్షాలతో ఊపిరిపోసుకుంటున్న పంటలు



గండేపల్లిలో సాగవుతున్న పెసర పంట

కంచికచర్ల : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలు కళకళలాడుతున్నాయి. జూన్ మాసంలో చెదురుముదురుగా కురిసిన వర్షాలకు రైతులు పలురకాల పంటలను సాగుచేశారు. జూలై మొదటి, రెండోవారాల్లో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు సాగుచేసిన మెట్టపైర్లు ఎండిపోయే పరిస్థితి నెలకొని ఉండటంతో జూలై ఆఖరివారంలో కురిసిన వర్షాలకు పంటలన్నీ ఊపిరిపీల్చుకుంటున్నాయి. ఇప్పటికే పెసర పంట మరో 15రోజుల్లో కోతకు రానుంది. అదేవిధంగా మొక్కజొన్న, పత్తి చేలు మాత్రం ఏపుగా పెరుగుతున్నాయి.

అధిక విస్తీర్ణంలో పత్తిసాగు..

కంచికచర్ల మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పలురకాల పంటలను సాగుచేశారు. వాటిలో పెసర 4,865 హెక్టార్లు, మొక్కజొన్న 2,005 హెక్టార్లు, పత్తి 7,755 హెక్టార్లు, మినుము 905 హెక్టార్లు, కందిపంట 30 హెక్టార్లు, మిర్చి 740 హెక్టార్లు, వరి 1,575 హెక్టార్లు, పసుపు 96 హెక్టార్లలో సాగవుతోంది. సకాలంలో వర్షం కురవడంతో ఈ పంటలన్నీ ఊపిరిపీల్చుకున్నాయి. ఈ ఏడాది వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవడంతో పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాలకు అదునులో పంటలు సాగుచేసామని, పంటలన్నీ వర్షాలకు ఏపుగా పెరుగుతున్నాయని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాడమాసం సెలవుదినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడితోటల్లో సేదతీరారు.

నేడు మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు

నందిగామ టౌన్: నందిగామ పట్టణంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. తన నివాసంలో ఆదివారం డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు గాంధీ సెంటరులోని మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అన్ని గ్రామాల్లో వేడుకలు.. ఎమ్మెల్సీ అరుణకుమార్

నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రతి గ్రామంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన సూచించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. కంచికచర్ల నెహ్రూబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు ఆపార్టీ పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు ఆదివారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

జయంతి వేడుకలు నిర్వహించాలని ఉదయభాను పిలుపు

జగ్గయ్యపేట అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని మాజీ ప్రభుత్వ విప్ ఉదయభాను పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

వారాహి మాతకు ప్రత్యేక పూజలు

నరసింహారావుపాలెం(వీరులపాడు): ఆషాడమాసంలో వారాహి అమ్మవారిని పూజిస్తే సకలం సిద్ధిస్తాయని అగస్త్య పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెంలోని అగస్త్య పీఠంలో ఆదివారం గాయత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వారాహి మాతకు పూజలు చేసి ఆషాడం సారె సమర్పించారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. ఈసందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉండాలని ముఖ్యంగా పాడి పంటలతో గ్రామాలు తలతూగాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, నాయకులు బొమ్మిశెట్టి భాస్కరరావు, దాములూరు మదుసూదనరావు, అల్లూరు వెంకటేశ్వరరెడ్డి, వనమా సూరి, నరసింహమూర్తి, పెద్దసంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా కేసులు పూర్తిగా తగ్గిపోయాయి. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం కొత్తగా ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాలేదని ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఆళ్ల హరీష్ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న షేర్‌మహ్మద్‌పేటకు చెందిన కట్టమూరి లక్ష్మీనరసమ్మ పూర్తిగా కోలుకుని ఆదివారం డిశ్చార్జి అయ్యారు. దీంతో ఆస్పత్రిలో ప్రస్తుతం ఒక్క డయేరియా కేసు కూడా లేదని డాక్టర్ హరీష్ వివరించారు. జూన్ 19వ తేదీ నుంచి డయేరియా వ్యాధి విజృంభించడంతో పేట మండలంలో చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట, వత్సవాయి మండలంలోని మక్కపేటలో అధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి నివారణ చర్యలు చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని గతనెల 19వతేదీ నుంచి ఇక్కడే ఉంటూ నివారణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. డీసీహెచ్‌ఎస్ నాయక్ కూడా తరచూ వచ్చి బాధితులకు అందజేస్తున్న వైద్యసేవలను పర్యవేక్షించారు. పేట ప్రభుత్వాస్పత్రి వైద్యులతో పాటు బూచవరం, వత్సవాయి పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్యులు డాక్టర్ అనిల్‌కుమార్, స్రవంతి, వాసంతి, సుష్మా, నాగరాణి, విద్యాసాగర్, పవన్, సమీర, సునీల్, మూడు మండలాల పీహెచ్‌సీల ఉద్యోగులు పాల్గొని వైద్యసేవలందించారు.

గోరింటా పూసింది

- గోరింటాకు అంటే మహిళలకు ఎంతో మక్కువ
- ఆషాడమాసంలో గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయం
- గోరింటాకుతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు



నవాబుపేటలో గోరింటాకు కోస్తున్న మహిళలు

పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం ప్రారంభమైంది. తమ బతుకు పండించే మంచిభర్త వస్తాడని చెబుతూ యువతుల సిగ్గులను ఎరుపెక్కించేదే గోరింట. గోరింటాకు అందాన్నే కాదు..ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తుంది. గోరింటాకు అంటే ఇష్టపడని మహిళలు ఉండరు. పల్లెలైనా, పట్టణాలైనా పండుగలు, శుభకార్యాల వేళ గోరింటాకుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఆషాడమాసంలో మహిళలు, యువతులు, చిన్నారులతో సహా ఇంటిల్లిపాదీ చేతులకు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయంగా వస్తోంది. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం వెనుక ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని పెద్దలు చెబుతున్నారు. గతంలో ప్రతిఇంట్లో గోరింటాకు చెట్టు ఉండేవి. వీటి నుంచి లేత ఆకులు కోసి రుబ్బు రోలులో మెత్తగా రుబ్బి మహిళలు చేతులకు, పాదాలకు అందంగా పెట్టుకునే వారు. ఎర్రగా పండిన చేతులు మహిళలు, యువతుల సహజ సౌందర్యానికి అదనపు వన్నెలద్దేవి. ప్రస్తుత కాలంలో చాలామంది సహజ సిద్ధమైన గోరింటాకుకి బదులుగా రెడీమేడ్‌గా షాప్‌ల్లో లభిస్తున్న కోన్‌లను ఆశ్రయిస్తున్నారు. పల్లెల్లో మాత్రం అధిక శాతం మంది ఇప్పటికీ సంప్రదాయంగా గోరింటాకునే రుబ్బి పెట్టుకుంటున్నారు.

ఆషాఢమాసంలోనే ఎందుకు..?

ఆషాఢమాసం అంటే వర్షాలు జోరుగా పడే రోజులు. నేలంతా తేమగా బురదతో ఉంటుంది. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలై ఉంటే మహిళలు నీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. తడినేలపై ఎక్కువగా తిరగాల్సి వస్తుంది. వర్షాకాలంలో సహజంగా ఉండే తేమ ప్రభావంతో మహిళల చేతులు, కాళ్లు ఒరిసిపోవడంతోపాటు గోళ్లు దెబ్బతినేవి. ఈసమస్యలకు గోరింటాకు మంచి ఉపశమనం ఇస్తుంది. ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకునే ఈ సంప్రదాయం వెనుక ఈ ఆరోగ్య ప్రయోజనం ఉందని పెద్దలు చెబుతున్నారు.

ప్రయోజనాలు...



ఎర్రగా పండిన గోరింటాకు

చేతికి గోరింటాకు పెట్టుకోవడం ద్వారా శరీరంలో ఉన్న వేడిని తగ్గిస్తుంది. దీనిని తలకు, కేశాలకు పట్టిస్తే రాలిపోకుండా, మృదువుగా ఉండటంతోపాటు చుండ్రు, దురద వంటి సమస్యలు దరిచేరవు. ఆటలమ్మ మచ్చలు, గాయాలు, నల్లని మచ్చల నివారణకు కూడా గోరింటాకు ఉపయోగిస్తారు.



పెనుగంచిప్రోలులో గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

కోన్‌లతో దుష్పరిణామాలు...

పట్టణ ప్రాంతాల్లో గోరింటాకు చెట్టు కనుమరుగు కావడంతో మార్కెట్‌లో దొరికే వివిధ రకాల కోన్‌లు, మెహిందీలతో ఆనందపడుతున్నారు. ఫ్యాషన్ మోజులో పడి, వీటిపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. గోరింటాకు చెట్టు నుంచి కోసి, రుబ్బడం లాంటి పనుల నుంచి తప్పించుకోవడం కోసం పల్లె ప్రజలు కూడా కోన్‌లపై ఆధారపడి పోతున్నారు. వీటిలో ఉండే పలు రసాయనాల మిశ్రమాల వలన అలర్జీలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. సహజ సిద్ధమైన గోరింటాకుతో ఎలాంటి దుష్పరిణామాలు రావని పెద్దలు చెబుతున్నారు.

వైభవంగా జగన్నాథ యాత్ర మహోత్సవం



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో జగన్నాథ రథ యాత్ర ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. కరకట్ట దిగువునగల జగన్నాథ మందిరం నుంచి అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రాంగణంలోని ఫంక్షన్ హాల్ వరకు రథ యాత్ర సాగింది. భక్తి సంకీర్తనలు, కోలాటం, భజన కార్యక్రమాలతో కనుల పండువలా జరిగిన రథ యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప స్వామి పంక్షన్ హాల్‌లో కూచిపూడి, భరతనాట్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, హరేకృష్ణ భక్త బృందంతో సంకీర్తనలు, భజనలు, స్వామీజీల ప్రవచనాలు జరిగాయి. టెంపుల్ డైరెక్టర్ దయానిధి దాస్ మాట్లాడుతూ ఆషాఢ మాసంలో శుక్ల పక్షం రెండో రోజున వచ్చే ఈ రథ యాత్ర ఎంతో ఆధ్యాత్మికతతో కూడినదని, ఈ ఉత్సవంలో విష్ణువు అవతారమైన జగన్నాథుడు తన తోబుట్టువులు బలభద్రుడు, దేవి సుభద్రలతో కలిసి ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నూతులపాటి బాలకోటేశ్వరరావు (బాల), గొల్లపూడి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'దుర్గా' డిపాజిట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ వన్‌టౌన్‌లోని దుర్గా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన సొమ్మును తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిపాజిట్‌దారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా సహకార బ్యాంక్ రిజిస్ట్రార్‌కు మెమొరాండం సమర్పించాలని బాధితులు నిర్ణయించారు. పశ్చిమ నియోజకవర్గంలోని కేదారేశ్వరపేటలోగల ఒక పాఠశాలలో ఆదివారం బాధిత డిపాజిట్‌దార్ల సమావేశం జరిగింది. పి.స్వామి చరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిది దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కోట్లాది రూపాయల డిపాజిట్లను సేకరించిన బ్యాంక్ పాలకవర్గం దానిని దివాలా దిశగా తీసుకువెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా డిపాజిట్ల కాలపరిమితి ముగిసినా తిరిగి చెల్లించకుండా ఆర్‌బీఐ నిబంధనల పేరుతో కాలయాపన చేయటం దుర్మార్గమన్నారు. గత రెండేళ్ల నుంచి వసూలు చేసిన మొండి బకాయిల నుంచి అయినా తమ డిపాజిట్లు చెల్లించాలని కోరారు. డిపాజిట్‌దారులలో అత్యధిక శాతం మంది వృద్ధులు, వితంతువులు, రిటైరైన ఉద్యోగులు ఉన్నారని, వారు వైద్యం చేయించేకునేందుకు కూడా డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పిల్లల పెళ్లిళ్ల కోసం డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నామని తెలిపారు. వృద్ధాప్యంతో పాటు మానసికంగా కూడా ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితికి తీసుకువచ్చిన బ్యాంక్ పాలకవర్గం చర్యలు అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు.